క్లుప్తంగా

ఘర్షణ కేసులో ముగ్గురి అరెస్టు

కాకినాడ రూరల్: సర్పవరం జంక్షన్‌లో ఫాస్ట్ ఫుడ్ సెంటరు నిర్వహిస్తున్న పితాని నవీన్ కుమార్‌పై ఉల్లిపాయలు కోసే చాకుతో దాడికి పాల్పడిన పక్కనే ఉన్న మరో ఫాస్ట్ ఫుడ్ నిర్వాహకులు తుట్టా వెంకట బాలాజీ, తుట్టా రాజు, తుట్టా రామకృష్ణపై కేసు నమోదు చేసి సోమవారం అరెస్టు చేసినట్టు సర్పవరం ఎస్సై శ్రీనివాస్ కుమార్ తెలియజేశారు. పోలీసుల వివరాలు ప్రకారం.. పక్కపక్కనే వ్యాపారం చేసుకుంటున్న ఇరువర్గాలు గతంలో ఘర్షణ పడడంతో కేసులు నమోదు చేశారు. తాజాగా ఈనెల 3న రాత్రి మరో సారి ఘర్షణ పడడంతో గాయపడిన నవీన్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నిందితులపై కేసు నమోదు చేసి, అరెస్టు చేశారు.

గ్రంథాలయానికి పుస్తకాల బహూకరణ



పుస్తకాలు అందజేస్తున్న డాక్టర్ సీఎస్ఆర్ శర్మ

బాలాజీచెరువు: కుళాయిచెరువు ఆవరణలో ఉన్న గాంధీనగర్ గ్రంథాలయానికి రిటైర్డ్ సివిల్ సర్జన్ ప్రముఖ వైద్యులు డాక్టర్ సీఎస్ఆర్ శర్మ పుస్తకాలు బహూకరించారు. కవిత్రయ విరచిత శ్రీ మదాంధ్ర మహాభారతం, ఆదిపర్వం, స్వర్గారోహణ పర్వం వరకూ గల 15 పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శర్మను గ్రంథాలయాధికారి ములంపాక శ్రీనివాసరావు అభినందించి, మహాభారతం అన్ని పర్వాలను అందజేయడం సంతోషంగా ఉందని, పాఠకులకు బాగా ఉపయోగపడతాయన్నారు.

ఆలయ ముఖద్వారాలకు శంకుస్థాపన



ఆలయంలో ముఖద్వారాలకు శంకుస్థాపన చేస్తున్న భక్తులు

బోట్‌క్లబ్: స్థానిక సూర్యారావుపేటలోని బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆలయ ముఖద్వారాలకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఆలయానికి రెండు వైపులా ముఖద్వారాలను నిర్మించనున్నట్టు ఆలయ ఈవో ఉండవల్లి వీర్రాజు తెలిపారు. ఆలయానికి కుడి వైపున ముఖద్వారం రూ.15 లక్షలతో నిర్మించే ముఖద్వారం చాంబర్ ఆఫ్ కామర్స్ నిర్మిస్తుందన్నారు. ఎడమ వైపు రూ.14 లక్షలతో నిర్మించే ముఖద్వారం భక్తులు విరాళాలతో నిర్మిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో చాంబర్‌ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు గ్రంధిబాబ్జి పాల్గొన్నారు.

వంతెనను ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు



తీవ్ర గాయాలైన కామరాజు

కరప: శిథిలమైన వంతెనను ఢీకొన్న ఘటనలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బిక్కవోలు మండలం తుమ్మలపల్లి గ్రామానికి చెందిన ఉల్లం కామరాజు సోమవారం కరపలోని చిరంజీవి కల్యాణ మండపంలో జరిగిన ఒక వివాహ కార్యక్రమంలో పాల్గొన్నాడు. అదే వివాహానికి వచ్చిన బంధువులను కరపలోని నక్కావారి ఎస్సీవీధిలో ఉంటున్న వారిని ఇంటి వద్ద దించాడు. తర్వాత మోటార్‌సైకిల్‌పై తిరిగి వస్తుండగా నక్కా వారి ఎస్సీవీధిలో పంట కాలువపై ఉండే వంతెన శిథిలమై, రోడ్డు అంచులు కోసుకుపోయి ప్రమాదభరితంగా తయారైంది. కామరాజు ఆ వంతెనను ఢీకొనడంతో అదు పుతప్పి కిందకు పడిపోయాడు. ఈ ప్రమాదంలో అతనికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు స్పందించి అపస్మారకస్థితిలో ఉన్న అతనిని 108లో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రంగరాయలో సూపర్ స్పెషాలిటీ బ్లాక్ ఏర్పాటుకు చర్యలు

బోట్‌క్లబ్(కాకినాడసిటీ): ఎంతో ప్రాముఖ్యత ఉన్న కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీలో సూపర్ స్పెషాలిటీ బ్లాక్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రంగరాయ మెడికల్ కాలేజీని పీఎంఎస్ఎస్‌వై పథకంలో చేర్చి 330 పడకల సూపర్ స్పెషాలిటీ బ్లాక్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఇటీవల కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జగత్ ప్రకాష్ నడ్డాను కలిసి వినతిపత్రం అందించినట్లు చెప్పారు. ప్రతి ఏటా 250 మంది ఎంబీబీఎస్, 203 మంది పీజీ, 10 మంది సూపర్ స్పెషాలిటీ నిపుణులు శిక్షణ పొందుతున్నారని తెలిపారు. అయితే ప్రత్యేకంగా సూపర్ స్పెషాలిటీ బ్లాకు లేకపోవడం వల్ల ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. సూపర్ స్పెషాలిటీకి కాకినాడ గవర్నమెంట్ ఐటీఐ ఆవరణలో 3.24 ఎకరాలు, కేన్సర్ సెంటర్‌కు అర ఎకరం కేటాయించినట్లు కేంద్రమంత్రికి వివరించినట్లు తెలిపారు.

జరభద్రం సుమీ..!

- అప్రమత్తతతోనే ఆపద దూరం
- జోరుగా బాణసంచా తయారీ
- ప్రమాదమని తెలిసీ పని చేస్తున్న కార్మికులు
- తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు



గైగోలుపాడులో బాణసంచా కేంద్రం వద్ద ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న సర్పవరం సీఐ పెద్దిరాజు



కాకినాడ రూరల్ కొవ్వాడలో బాణసంచా తయారీ కేంద్రం

కాకినాడ రూరల్: దీపావళి పండగ అంటే చికటిని తరిమి వెలుగులునిస్తుంది. చిన్నా పెద్దాలందరికీ ఆనందాన్నిస్తుంది. ప్రతి ఇంటా క్రాకర్స్, మతాబులు వెలుగులు, చిచ్చుబుడ్ల కాంతులు, నింగిలో తారాజువ్వల సవ్వడి ఉంటుంది. రంగు రంగుల కాంతులతో శబ్దాలతో నేలపై టపాసులు మోతతో అంతా ఎంతో సంతోషంగా ఉంటారు. అయితే ఈ సండడి మన పాటిల శాపంగా మారకూడదు. అంతా అప్రమత్తంగా ఉండాలి. బాణసంచా కాల్చేటప్పుడు జాగ్రత్తలు వహించాలి. అంతేకాకుండా తమకు జీవనోపాధిని అందించే బాణసంచా తయారీ ఒక్కోసారి ప్రాణాలనే హరిస్తుంది. బాణసంచా తయారీ నిర్వాహకులతోపాటు కూలీలు ప్రమాదమని తెలిసి కూడా పని చేస్తున్నారు. అక్కడ ప్రతి ఒక్కరూ భద్రంగా ఉండాలి.

కాకినాడ రూరల్ నియోజకవర్గ పరిధిలో దీపావళి బాణసంచా తయారీ 6 చోట్ల చేపడుతున్నారు. రూరల్ మండలంలోని కొవ్వాడ, గంగనాపల్లి, అర్బన్ పరిధిలోని 49వ డివిజన్ గైగోలుపాడు వద్ద, కరప మండలంలో వేళంగి, నడకుదురు, గొర్రిపూడి గ్రామాలలో బాణసంచా తయారీ కేంద్రాలు ఉన్నాయి. వీటికి లైసెన్స్‌లతోపాటు అన్ని అనుమతులు ఉండగా కొన్ని చోట్ల అనధికార బాణసంచా తయారీ కేంద్రాలు కొనసాగుతున్నాయి. ఆయా కేంద్రాలలో ప్రమాదాలు జరగకుండా అప్రమత్తతతో వ్యవహరించగలిగితే ఆపద దూరమవుతుంది. దీనిపై జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసులు రంగంలోకి దిగారు. కాకినాడ రూరల్‌లోని ఇంద్రపాలెం, కరప, సర్పవరం పోలీసులు ఆయా కేంద్రాలను తనిఖీ చేసి అనుమతులు పరిశీలనతోపాటు సేఫ్టీ పరంగా తీసుకుంటున్న చర్యలను ఇటీవల పరిశీలించారు. ప్రమాదాలు నివారణకు పలు సూచనలు చేశారు.

తనిఖీలు చేస్తున్నాం

బాణసంచా తయారీ కేంద్రాలు తనిఖీ చేయడంతో పాటు ప్రమాదాలకు ఆస్కారం లేకుండా భద్రతా చర్యలు పాటించేలా నిర్వాహకులకు సూచనలు చేశాం. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మందుగుండు సామగ్రి తయారీ, నిల్వ కేంద్రాలను తనిఖీ చేశాం.

– ఎం.వీరబాబు, ఎస్సై, ఇంద్రపాలెం

అక్రమంగా నిల్వ ఉంచితే సమాచారం ఇవ్వండి

దీపావళి మందుగుండు సామగ్రి మండే స్వభావం ఉన్నవి. అవి ఉన్న చోట ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువ. వాటికి దూరంగా ఉండాలి. ప్రభుత్వ అనుమతి లేకుండా బాణసంచా తయారీ చేయకూడదు. ఎవరైనా అక్రమంగా మందుగుండు సామగ్రి నిల్వ ఉంచితే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

– బొక్కా పెద్దిరాజు, సీఐ, సర్పవరం సర్కిల్ స్టేషన్

భద్రతా నియమాలు ఇవే

- బాణసంచా తయారీదారులు మందుగుండు సామగ్రిని అనుమతి లేకుండా నిల్వ చేయకూడదు.
- తయారీ కేంద్రంలో విద్యుత్ వైర్లు, ఫ్యూజ్‌లు ప్రమాదానికి కారణమవ్వకుండా చూసుకోవాలి.
- సిగరెట్లు తాగడం చేయకూడదు. గ్రైండర్లరు దగ్గరులో ఉంచకూడదు.
- ఫైర్ ఎక్విప్‌మెంట్, ఇసుక అందుబాటులో ఉంచుకోవాలి.
- ప్రథమ చికిత్స కోసం బర్నజిల్, బ్యాండేజిలు, యాంటీ సెప్టిక్‌లు అందుబాటులో ఉంచుకోవాలి.
- ఎమర్జెన్సీ రూట్ ఖాళీగా ఉంటుకోవడంతో పాటు పిల్లలను దూరంగా ఉంచాలి.

అప్స జిల్లా అధ్యక్షుడిగా నరసింహమూర్తి



విజయవాడలో జరిగిన కార్యక్రమంలో అప్స జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన నరసింహమూర్తి

కాకినాడ రూరల్: ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్(అప్స) జిల్లా అధ్యక్షుడిగా కాకినాడ రూరల్ గైగోలుపాడులోని మూర్తి స్కూల్ అధినేత, వైఎస్సార్ సీపీ నాయకుడు పాలిక నరసింహమూర్తి, జిల్లా కార్యదర్శిగా తోటకూర వెకంటేశ్వరరావు ఎన్నికయ్యారు. విజయవాడలో ఆదివారం జరిగిన సంఘ సమావేశంలో జిల్లా కమిటీలను ఎన్నికున్నారు. అనంతరం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులకు నియామకపు పత్రాలను రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బీఎస్పీ చౌదరి పంపిణీ చేసి, సత్కరించారు. జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన నరసింహమూర్తి మాట్లాడుతూ ప్రైవేట్ స్కూల్స్ ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళతామన్నారు. ఈ పదవికి ఎంపిక చేసిన అప్స రాష్ట్ర అధ్యక్షుడు సుబ్రహ్మణ్య రాజు, మాజీ అధ్యక్షుడు సుందర రామశర్మలకు ధన్యవాదాలు తెలియజేశారు.

గురజనాపల్లి ఆయుర్వేద హాస్పిటల్‌కు అవార్డు

కలెక్టర్ షన్మోహన్ నుంచి అవార్డు అందుకున్న డాక్టర్ దివ్య



కాకినాడలో కలెక్టర్ షన్మోహన్ నుంచి అవార్డు అందుకుంటున్న డాక్టర్ దివ్య



కలెక్టర్ షణ్మోహన్, నగరపాలక సంస్థ కమిషనర్ భావన చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న వీరబాబు



అవార్డు అందుకుంటున్న రామకృష్ణ

కరప: స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది వివిధ క్యాటగిరీలలో రాష్ట్ర, జిల్లాస్థాయిలో అవార్డులు ప్రకటించింది. జిల్లా స్థాయి అవార్డుల్లో స్వచ్ఛ హాస్పటల్ విభాగంలో కరప మండలం గురజనాపల్లిలోని ప్రభుత్వ ఆయుర్వేద హాస్పటల్‌కు బెస్ట్ స్వచ్ఛ హాస్పటల్ అవార్డు లభించింది. కాకినాడ కలెక్టరేట్‌లోని గోదావరి కళాక్షేత్రంలో సోమవారం జరిగిన అవార్డుల ప్రదానం కార్యక్రమంలో కలెక్టర్ షన్మోహన్ సగిలి, ఎమ్మెల్సీ కె.పద్మశ్రీ తదితర ప్రజాప్రతినిధుల నుంచి బెస్ట్ స్వచ్ఛ హాస్పటల్ అవార్డును డాక్టర్ బి.దివ్య అందుకున్నారు. కాకినాడజిల్లా ఆయుష్ వైద్యాధికారి షాజాద్ ఆలీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ దివ్య మాట్లాడుతూ జిల్లా స్థాయిలో స్వచ్ఛ హాస్పటల్ అవార్డు తీసుకోవడం సంతోషంగా ఉందన్నారు. సిబ్బంది, గ్రామస్తుల సహకారంతోనే సాధ్యమైందన్నారు. తమ ఆయుర్వేద ఆసుపత్రి ఆవరలక్ష ఔషధ మొక్కలు పెంచుతున్నామన్నారు. త్వరలోనే పంచకర్మ చికిత్సలు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. కరప, కాజులూరు మండలాలకు తమ ఆయుర్వేద హాస్పటల్ ద్వారా వైద్యసేవలందిస్తున్నామన్నారు. అలాగే ఆసుపత్రిలో, హైస్కూలులో ప్రతిరోజూ ఉచితంగా యోగా శిక్షణ ఇస్తున్నట్టు డాక్టర్ దివ్య తెలిపారు.

కాకినాడ స్పెషల్ సబ్‌జైల్‌కు అవార్డు

కాకినాడ లీగల్: స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమం భాగంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన వాటిలో పరిసరాల పరిశుభ్రతగా ఉండడంతో కాకినాడ స్పెషల్ సబ్‌జైల్‌కు అవార్డు వచ్చింది. సోమవారం కాకినాడ గోదావరి కళాక్షేత్రంలో కలెక్టర్ షణ్మోహన్ సగిలి, నగర పాలక సంస్థ కమిషనర్ భావన, ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా కాకినాడ స్పెషల్ సబ్‌జైల్ సూపరింటెండెంట్ ఎం.వీరబాబు అవార్డును అందుకున్నారు.

ఉత్తమ స్వచ్ఛతా ఎన్‌జీవో అవార్డు

బోట్‌క్లబ్: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉత్తమ స్వచ్ఛతా ఎన్‌జీవో అవార్డును కాకినాడ భాస్కర్‌నగర్‌లోని పరివర్తన వీధి బాలల పునరావాస కేంద్రం దక్కింది. గోదావరి కళాక్షేత్రంలో సోమవారం జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా పరివర్తన వ్యవస్థాపకులు వక్కలంక రామకృష్ణ ఈ అవార్డు అందుకున్నారు.

సమాజ శాంతి ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యం



ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో మాట్లాడుతున్న భరత్‌కుమార్

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): సమాజంలో శాంతి లక్ష్యంగా ఆర్‌ఎస్‌ఎస్ పనిచేస్తుందని ఆర్‌ఎస్‌ఎస్ దక్షిణ మధ్య క్షేత్ర ప్రచారక్ భరత్‌కుమార్ అన్నారు. కాకినాడలో ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలు, దసరా ఉత్సవాలను నిర్వహించారు. దేశ పునర్వైభవం కోసం హిందూ సమాజాన్ని మేల్కొపుతూ వ్యక్తి నిర్మాణం ద్వారా అహర్నిశలు కృషి చేస్తూ సమాజంలో భావ నిర్మాణం చేస్తున్నామన్నారు. ప్రపంచ శాంతి లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. ఆర్‌ఎస్‌ఎస్ 1925లో ప్రారంభమైందన్నారు. దేశభక్తి నిర్మాణం చేస్తూ దేశ సేవలో నిమగ్నమవ్వాలన్నారు. ప్రపంచ పరివర్తన కోసం విజయదశమి ఉత్సవం చేసుకొంటున్నామని కలెక్టర్ షణ్మోహన్ సగిలి అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా ప్రచారక్ మంతన రామచంద్రరాజు, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు విజయప్రకాష్, సోమశేఖర్, జి.భవదీయ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి అమానుషం

బోట్‌క్లబ్: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై మతోన్మాది అడ్వకేట్ దాడిని నిరసిస్తూ సీపీఐ దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో స్థానిక గోడారిగుంట అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం రాత్రి ఆందోళన చేశారు. సీపీఐ జాతీయ సమితి సభ్యుడు తాటిపాక మధు మాట్లాడుతూ కింద స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు ఒక దళిత మేధావి ఎదిగినందుకు మతోన్మాదులు సహించలేక పోతున్నారన్నారు. దీనిలో భాగంగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి చేశారని ఈ దాడి భారత ప్రజాస్వామ్యం రాజ్యాంగంపై దాడి చేసినట్లుగా భావిస్తున్నామన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై ఇలాంటి దుశ్చర్య పాల్పడ్డారంటే ఇక సామాన్య దళితులకు ఏ రక్షణ ఉంటుందో అర్థం చేసుకోవాలన్నారు. వెంటనే ఉన్మాది అడ్వకేట్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రధానమంత్రి స్పందించాలని భారత ప్రభుత్వం ఈ దుచర్యను ఖండించాలని ప్రజాస్వామిక వాదులు అన్ని రాజకీయ పార్టీలు ముందుకు రావాలని మధు కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కన్వీనర్ నక్క శ్రీనివాసరావు, ప్రముఖ న్యాయవాది తోకల ముఖేష్ పాల్గొన్నారు.

ఇక 'ఛేంజెస్'లో ఏఆర్టీ మందులు



ఏఆర్టీ మందులు అందజేస్తున్న డాక్టర్ చలమయ్య

కాకినాడ క్రైం: హెచ్ఐవీ, ఎయిడ్స్ బాధితులు వినియోగించే ఏఆర్టీ మందులు ఇకపై కాకినాడ రమణయ్యపేట కూరగాయల మార్కెట్ సమీపంలో ఉన్న ఛేంజెస్ స్వచ్ఛంద సంస్థలో అందుబాటులో ఉంటాయని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ(డీఎల్ఏటీ) నివారణాధికారి డాక్టర్ ఎస్.చలమయ్య అన్నారు. ఈ మేరకు కార్యాలయంలో సోమవారం కమ్యూనిటీ ఏఆర్టీ రీఫిల్ గ్రూప్‌ను ప్రారంభించారు. ప్రాజెక్టు మేనేజర్ దుర్గాభవాని అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో చలమయ్య మాట్లాడుతూ, బాధితులు తమ ఇళ్లకు దూరంగా ఉన్న ఆసుపత్రులకు వెళ్లి ఏఆర్టీ మందులు తెచ్చుకునేందుకు ఇబ్బందులు తలెత్తుతున్న నేపథ్యంలో స్థానికంగా ఏఆర్టీ రీఫిల్లింగ్ గ్రూప్‌ను ప్రారంభించినట్టు తెలిపారు. హైరిస్క్ పాపులేషన్‌కు చెందిన వారు అయిన మహిళలు, ట్రాన్స్‌జెండర్లలో హెచ్ఐవీ బాధితులు అయిన వారికి ఛేంజెస్ కార్యాలయంలో ఏఆర్టీ మందులు అందిస్తారన్నారు. బాధితులు జీజీహెచ్‌కు వెళ్లి మందులు తీసుకునే అవసరం లేదని తెలిపారు. బాధితులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ పి.బాలాజీ, క్లస్టర్ పీవో జి.రామానాయుడు, ఏఆర్టీ సెంటర్ జీజీహెచ్ వైద్యులు డాక్టర్ రత్నమణి, వైద్యాధికారి సి.చంద్రమౌళి, షేర్ ఇండియా, ఛేంజస్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఐక్యరాజ్య సమితి సమావేశానికి మిథున్‌రెడ్డికి అవకాశంపై హర్షం

కాకినాడ రూరల్: ఐక్యరాజ్య సమితి సర్వ సభ్య సమావేశానికి వైఎస్సార్ సీపీ ఎంపీ మిథున్‌రెడ్డికి అవకాశం లభించడంపై ఆ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి సోమవారం హర్షం వ్యక్తం చేశారు. అక్టోబరు 27 నుంచి అమెరికాలోని న్యూయార్క్‌లో జరగబోయే ఐక్యరాజ్య సమితి సర్వ సభ్య సమావేశానికి 15 మంది సభ్యుల భారత్ బృందానికి పురందేశ్వరి నాయకత్వం వహించనున్నారు. సభ్యుడిగా మిథున్ రెడ్డి పేరును ప్రధాని మోదీ చేర్చడం అభినందనీయమని ఆమె పేర్కొన్నారు. టీడీపీ, జనసేన ఎంపీలు అభ్యంతరం వ్యక్తం చేసినా బీజేపీలోని ఒక ముఖ్య నాయకుడు మాట్లాడడంతో వారంత సైలంట్ అయ్యారని తెలిసిందని ఆమె పేర్కొన్నారు. పర్యావరణం అభివృద్ధి, శాంతి భద్రతలు తదితర అంశాలపై ఈ బృందం చర్చిస్తుందన్నారు.

పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు



పంచారామ క్షేత్రంలోని కుమారా రామభీమేశ్వరస్వామి

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి ప్రీతైన రోజు సోమవారం కావడంతో ఆలయంలోని కుమారా రామ భీమేశ్వరస్వామి వారికి, బాలాత్రిపుర సుందరి అమ్మవారికి ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో అర్చకులు పూజలు చేశారు. అనంతరం స్వామి, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. తెల్లవారు జాము నుంచి స్వామివారిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. స్వామివారి తొలి అభిషేకం తిలకించడానికి క్యూలో వేచి ఉన్నారు. ఆలయానికి వచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలో ధ్వజస్తంభం వద్ద ఉన్న శివలింగానికి స్వయంగా అభిషేకాలు చేశారు. భక్తులకు ఉదయం పులిహోర, మధ్యాహ్న అన్నప్రసాదం, సాయంత్రం శనగలు, పులిహోర ప్రసాదంగా అందించారు. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, అల్లొకి రాజ్‌గోపాల్‌శర్మ, సన్నిధిరాజు వెంకన్న, శ్రీకాకుళపు సత్యనారాయణ మూర్తి, వినయ్, చెరుకూరి రాంబాబులు పూజాధికార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక మఠంసెంటర్‌లోని రామలింగేశ్వర స్వామి ఆలయంలోను, గొంచాలలో ఉన్న శివాలయంలోను, పీబీ దేవం శివాలయంలోను, పెద్దాపురం పట్టణ, మండల పరిధిలోని శివాలయాలోను పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

వివక్షతో మాట్లాడిన నేతపై చర్యలు తీసుకోవాలి

కాకినాడ రూరల్: సర్పవరం గ్రామ సభలో దళితులపై వివక్షతో మాట్లాడి కించపరిచిన జనసేన నాయకుడు ముద్దన ప్రకాష్‌పై చర్య తీసుకోవాలని లేకుంటే ఆందోళనకు సిద్ధమవుతామని ఆ గ్రామ ఎమ్మార్పీఎస్ నాయకుడు సవరం చిట్టిబాబు హెచ్చరించారు. గ్రామంలో సోమవారం సాయంత్రం జరిగిన గ్రామ సభలో శ్మశాన వాటిక వద్ద వాటర్ ట్యాంక్ విషయమై దళితులపై వివక్షతను చూపేలా ప్రకాష్ మాట్లాడారని ఇలాంటివి పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై దళిత జిల్లా నాయకులతో మాట్లాడి ఉద్యమం చేపడతామని ఆయన తెలియజేశారు.

కర్షకుడికి కష్టాలు

- ప్రకృతి వైపరీత్యాలు, యూరియా కొరత, నకిలీ విత్తనాలు
- రైతులను దోచుకుంటున్న దళారులు
- నకిలీ విత్తనాలపై గ్రీవెన్సులో ఫిర్యాదు
- ఆందోళన చెందుతున్న అన్నదాత



పాడా పీడీకి ఫిర్యాదు చేస్తున్న పత్తి రైతులు

పిఠాపురం: చీటీ ఉంటేనే యూరియా బస్తా ఇచ్చారు. కూపన్ కోసం గంటల తరబడి వ్యవసాయ శాఖాధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేయాలి. కూపన్ ఇచ్చాకా యూరియా తీసుకోడానికి మరో రోజు పడిగాపులుపడాలి. ఇదీ రైతన్న పరిస్థితి. కూపన్ ఇవ్వడానికి ఎరువులు తీసుకోవడానికి పోలీసు బందోబస్తు నడుమ ఉండాల్సి వచ్చింది. టీడీపీ నేతల దుకాణాలకు మాత్రం లారీలకు లారీల సరుకు దిగిపోయింది. యూరియా కొరతను ఆసరాగా చేసుకుని టీడీపీ నేతలు అధిక ధరలకు యూరియా అమ్ముకుని అందినంతా దోచుకున్నారు. ఇప్పుడు కొత్తగా పత్తి విత్తనాలలో లోపాలు బయటపడడంతో రైతులు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

ఎరువుల కోసం ప్రదక్షిణలు

ప్రస్తుతం రైతుల అవసరం మేరకు అంతా సిద్ధమని ముందు నుంచి అధికారులు చెప్పుకొస్తున్నారు. అయితే ఎరువుల కోసం రైతులు పీఏసీఎలు, రైతు సేవా కేంద్రాలు, ప్రైవేటు డీలర్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న పరిస్థితి ఏర్పడింది. తమకు కావలసిన పూర్తిస్థాయిలో ఎరువులను ప్రభుత్వం సరఫరా చేయలేకపోతున్నారంటూ పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆది నుంచీ కష్టాలే..

ఖరీఫ్ సాగులో ఆది నుంచి రైతులు కష్టాలను ఎదుర్కొంటున్నారు. నిన్న, మొన్నటి వరకు సాగునీటి లభ్యత లేక ఖరీఫ్ ఆలస్యం కాగా ఎట్టకేలకు వరి నాట్లు పూర్తయ్యాయి. ఇప్పుడు యూరియా కష్టాలు కొనసాగుతున్నాయి. రైతులకు అవసరమయ్యే ఎరువులు లభ్యత పూర్తి స్థాయిలో లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదనేది క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలిస్తుంటే అర్థమవుతుంది. ముఖ్యంగా యూరియా కొరత వేధిస్తోంది అనేది అన్నదాతల ఆరోపణ. తగిన ఏర్పాట్లు చేసి అవసరమయ్యే యూరియాను అందుబాటులో ఉంచాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే అదునుగా భావిస్తున్న ప్రైవేటు డీలర్లు పలు చోట్ల కృత్రిమ కొరతను సృష్టిస్తున్నారు. మరో వైపు అధికార పార్టీ నేతలు తమకు నచ్చిన వారికి యూరియాను కట్టబెడుతుండడంతో మిగిలిన రైతులకు పూర్తిస్థాయిలో చేరడం లేదు. ఈ నేపథ్యంలో పంటల దిగుబడిపై ప్రభావం పడుతుందని కర్షకులు ఆందోళన చెందుతున్నారు.

రూ.2 లక్షలు నష్ట పోయా

నేను రెండు ఎకరాల్లో పత్తి సాగు చేశా. సాధారణంగా తెగుళ్లు ఇతర సస్యరక్షణకు తగిన చర్యలు తీసుకున్నాను. సంబంధించిన పురుగు మందులు పిచికారీ చేశా. కానీ కాయ కట్టి పత్తి దిగుబడి రావాల్సిన సమయంలో మొక్కలు సచ్చిపోతున్నాయి. కనీసం ఒక కేజీ కూడా పత్తి దిగుబడి వచ్చే అవకాశం లేకుండా పోయింది. ఎంతో మంచి విత్తనం అని చెప్పిన షాపు యజమానిని అడిగితే కనీసం సమాధానం కూడా ఇవ్వడం లేదు. మాకు సరైన న్యాయం చేయకపోతే చాలా ఇబ్బందులకు గురవుతాం .

– జోరుగంటి రాంబాబు, పత్తి రైతు, చేబ్రోలు

నకిలీ విత్తనాలతో ఇబ్బంది

పంట కాలం 120 రోజులే అది పూర్తయిన వెంటనే మరో పంట వేసుకోవచ్చు. దీనివల్ల అదనపు ఆదాయం వస్తుందంటూ విత్తన కంపెనీలతోపాటు అధికారులు నమ్మబలకడంతో రైతులు ఆశపడి విత్తనాలు కొనుగోలు చేశారు. తీరా పంట వేసాకా తెలిసింది విత్తనాల్లో తేడా ఉందని పంట పండకుండానే నేల పాలవుతుండడంతో తాము మోసపోయామని భావించారు. తమకు జరిగిన నష్టాలకు బాధ్యులు ఎవరనేదానిపై నిగ్గు తేల్చాలంటూ రైతులు రోడ్డెక్కారు. గత మూడు రోజులుగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై సోమవారం పిఠాపురం పాడా కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల విభాగంలో కూడా ఫిర్యాదు చేశారు. నకిలీ విత్తనాలు అమ్మి తమను మోసం చేసిన కంపెనీపై, సంబంధిత సిబ్బందిపై వాటిని అమ్మిన దుకాణదారులపై చర్యలు తీసుకుని డిమాండ్ చేస్తున్నారు.

ఘనంగా గౌరీదేవీ ప్రతిష్ఠ



కొత్తపల్లిలో గౌరీదేవిని ఊరేగిస్తున్న భక్తులు

కొత్తపల్లి: స్థానిక బీటు వీధిలోని ఏర్పాటు చేసిన మందిరంలో సోమవారం గౌరీదేవి (వరిదుబ్బు)ని ఘనంగా ప్రతిష్ఠించారు. పొలంలోకి వెళ్లి తీసుకొచ్చిన గౌరీదేవిని బాజాభజంత్రీలతో కొత్తపల్లి, వాకతిప్ప, కుతుకుడుమిల్లి గ్రామాల్లో ఊరేగించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గౌరీశంకర ఉత్సవ కమిటీ సభ్యులు కొండక వీరభద్రరావు, వడగా మోహనరావు మాట్లాడుతూ వరిదుబ్బును గౌరీదేవీగా భావించి ఆ రోజంతా ఉపవాసం ఉండి సాయంత్రం ఊరంతా ఊరేగించి ఆ తర్వాత బాల కన్యతో ప్రతిష్ఠిస్తామన్నారు. 31 రోజుల పాటు గౌరీదేవీకి ఉదయం, సాయంత్రం పూజలు చేస్తామన్నారు. కార్తిక పౌర్ణమి, మూడు రోజుల ముందు గౌరీశంకరుడిగా భావించిన నందీశ్వరుడిని ఊరేగింపుగా తీసుకొచ్చి ప్రత్యేక పూజలను నిర్వహిస్తామన్నారు. దీంతో గౌరీదేవీ ఉత్సవాలు ముగుస్తాయన్నారు. ఇది తరతరాలుగా వస్తున్న ఆచారమని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.